"ఏమిటి?" అని అడిగాడు యజమాని.

కొంచెం తడబడి మెల్లిగా గొంతు సవరించుకొని "వస్తువుల ఖరీదులన్నీ చాలా పెరిగిపోయాయండి" అన్నాడు.

ఆ యజమాని దేవాంతకుడు. నరసింహారావు ఏమి అడగ దలచుకున్నాడో గ్రహించి, ముందరి కాళ్ళకి బంధంగా "అవును. చాలా పెరిగిపోయాయి. ఆఫీసు ఖర్చులు కొంత తగ్గించుకోవాలని ఆలోచిస్తున్నాను. ఏమీ పాలుపోవటం లేదు" అన్నాడు.

నరసింహారావుకి గొంతులో ఏదో అడ్డంపడినట్లయింది.... కాని గొంతు సవరించుకొని, మరి కొంచెం ధైర్యం తెచ్చుకొని, "నాకు జీతం బొత్తిగా చాలటం లేదండి. ఇంక్రిమెంటు ఏమైనా ఇస్తేనేగాని, బొత్తిగా గడిచేటట్టు లేదు. మీ ఆఫీసులో చేరి రెండేండ్లయింది. పైగా, నేను చాలా కష్టపడుతున్నాను కూడాను. ముగ్గురు మనుష్యుల పనిచేస్తున్నాను, నేను ఒకణ్ణే" అని అన్నాడు.

నరసింహారావు మొహం చూస్తూ యజమాని "నరసింహారావు, ఆఫీసు ఖర్చు చాలా ఎక్కువ అయిందని ఇప్పుడే కదా నీకు చెప్పాను. నువ్వు ఒక్కడివీ ముగ్గురు గుమాస్తాలపని చేస్తున్నానంటున్నావ్. ఆ తక్కిన ఇద్దరూ ఎవరో చెప్పు — వాళ్ళని తీసి పారేస్తాను. ఆఫీసు ఖర్చు కొంతేనా తగ్గుతుంది" అన్నాడు.

నరసింహారావు నోట మాటలేక అలాగే నిలుచున్నాడు.

---

# 20. రమణి రాసిన ఉత్తరం

"రామారావ్! రేపు ఆదివారం; ఎల్లుండి గాంధీజీ జన్మదినం; ఆ మర్నాడు మహాలయ అమావాస్య. మూడు రోజులు బ్యాంకికి సెలవు. ఇవ్వాళ శనివారం పన్నెండు గంటలకే బ్యాంకి మూసేస్తారు

కదూ! ఇప్పుడు పదకొండు ముప్పావు అయింది. త్వరగా టాక్సీలో బ్యాంకికి వెళ్ళి, ఈ లక్షరూపాయలు మన అకౌంటులో కట్టు. నేను అర్జంటు పనిమీద వెడుతున్నాను. ఇంకో అరగంటలో ఎలాగా మన ఆఫీసు మూసివేస్తారు గనుక, నువ్వు బ్యాంకినించి అలాగే ఇంటికి వెళ్ళిపో. ఈ డబ్బు కట్టిన చలాన్ మాత్రం జాగ్రత్తగా నీ దగ్గర ఉంచి, బుధవారంనాడు ఆఫీసుకు రాగానే నాకియ్యి. ఇవి అన్నీ వెయ్యిరూపాయల నోట్లే. నూరు ఉన్నాయో లేదో చప్పున లెక్కపెట్టు" అని నోట్ల కట్టను రామారావు చేతిలో పెట్టాడు, మేనేజింగు డైరెక్టరు వెంకట్రామయ్య.

రామారావు మూడేళ్ళుగా ఆ కంపెనీలో క్యాషియర్ పనిచేస్తున్నాడు. చకచక నోట్లను లెక్కపెట్టడం అలవాటయిపోయింది గనుక, రెండు నిమిషాలలో నూరు నోట్లను లెక్కపెట్టి, "నూరు నోట్లు ఉన్నాయండీ; సరిగ్గా లక్షరూపాయలు," అన్నాడు.

"అవును. ఇంక నువ్వు వెళ్ళు," అని వెంకటరామయ్య తల వూపగానే రామారావు, మేనేజింగ్ డైరెక్టరు గదినుంచి బైటికి వెళ్లాడు.

వెంకటరామయ్య తృప్తిగా, బల్లమీద రెండుచేతులూ పెట్టుకొని కూచున్నాడు. అనాడు, వెంకటరామయ్యకు ఒక పర్వదినం. ఆయన కలప వ్యాపారం ప్రారంభించి పదేళ్ళు అయింది. అది ఓ మోస్తరుగా లాభసాటి వ్యాపారమే అయినా, ఇన్నాళ్ళూ పెద్ద పెద్ద ఆర్డర్లు ఏమీ రాలేదు. ఎంత పెద్ద ఆర్డరు వచ్చినా యాభై వేల రూపాయలలోపే. ఇవ్వాళ ఎనిమిది లక్షల రూపాయలకు ఆర్డరు వచ్చింది. దానితోపాటు లక్ష రూపాయల బయానా చేతికి వచ్చింది. ఒకటిన్నర సంవత్సరం లోపల, దఫాలవారీగా అతడు యాభయ్యేసివేల రూపాయల కలప అందిస్తూ ఉండాలి. సరకు అందివ్వగానే, ఆ సరకువిలువ మళ్ళీచేతిలో పడుతుంది. మొత్తంమీద ఈ ఆర్డరుమీద అతనికి ఎనభై వేల రూపాయల లాభం కిట్టుబాటు అవుతుంది. ఏడాదిన్నరలో ఎనభై వేల రూపాయల లాభం, చాలా మంచి లాభమే. ఈ ఆలోచన అతనికి మంచి తృప్తిని కలిగించింది. ఇప్పుడు తను చెయ్యవలసిందల్లా, తనకు మామూలుగా కలపను సప్లయి చేసే బలార్షా కంట్రాక్టరు, యీ సంవత్సరం

అతడు బలార్షా అడవులలో కొట్టించే కలపనంతటినీ తనకే సప్లయి చేసేటట్టు చూసుకోవాలి. వీలయితే, కలప రేటుసుకూడా కొంచెం తగ్గించేటట్టు చూసుకోవాలి. అదేగనుక సాధ్యం అయినట్లయితే, తన లాభం లక్షరూపాయలదాకా ఉంటుంది. అంచేత, రాత్రి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి బలార్షా వెళ్ళి, ఆదివారం, సోమవారం అక్కడ ఉండి, బేరం స్థిరపరచుకొని మంగళవారం నాటికి మళ్ళీ హైదరాబాద్ రావచ్చును.

వెంకటరామయ్య ఈ నిర్ణయానికి వచ్చేటప్పటికి, అతడి కళ్ళు గోడమీద గడియారము మీదికి వెళ్ళాయి. గడియారం పన్నెండు గంటలకి అయిదు నిమిషాలు తక్కువ చూపించింది. వెంటనే వెంకటరామయ్యకు బ్యాంకి పన్నెండు గంటలకు మూసివేస్తా రన్నమాట జ్ఞాపకం వచ్చింది. రామారావు ఇంకా బ్యాంకికి చేరాడో లేదో అని సంశయం కలిగింది. బ్యాంకికి ఫోన్‌చేసి ఏజెంటుతో మాట్లాడాలనుకున్నాడు. ఫోన్ చెయ్యగానే ఏజెంటు పలికాడు.

"నేను వెంకటరామయ్యనండీ! మా క్యాషియర్ రామారావును లక్ష రూపాయలు ఇచ్చి పంపించాను. మా కంపెనీ అకౌంటులో జమ కట్టు మన్నాను. ఈ పాటికి అక్కడికి వచ్చే ఉంటాడు. ఒకవేళ పది నిమిషాలు లేటయినా, దయచేసి యివ్వాళ్ళే జమకట్టుకోండి" అన్నాడు.

లక్షరూపాయాలు జమకట్టుకోవడానికి గంటసేపయినా ఫరవాలేదనుకున్న బ్యాంకి ఏజెంటు కంఠం "కొంచెం ఉండండి సార్! రామారావు బ్యాంకికి వచ్చాడేమో చూసి చెపుతాను," అని ఫోన్‌లో బదులు పలికింది.

వెంకటరామయ్య ఫోన్ చెవిదగ్గరే పెట్టుకున్నాడు. ఒక నిమిషములో మళ్ళీ ఏజెంటు కంఠం "హలో, వెంకటరామయ్యగారూ! మీ క్యాషియర్ మా క్యాష్ కౌంటరు దగ్గరే ఉన్నాడు. మీ లక్షరూపాయలు జమ కడుతున్నట్లే," అని చెప్పింది.

"థాంక్స్" అని ఫోన్ పెట్టేసి వెంకటరామయ్య కుర్చీలోనుంచి లేచి, తన గదిలోనుంచి బయటికి వచ్చాడు.

ఎప్పుడు ఇంటికి పోదామా అని ఆలోచిస్తున్న ఆరుగురు గుమా

స్టాలనూ, షైపిస్టునూ ఆఫీసుకు తాళాలు వేసుకొని ఇళ్ళకు పొమ్మని చెప్పి, వెంకటరామయ్య కారు ఎక్కి వెళ్ళిపోయాడు.

*　　　　*　　　　*

మేనేజింగ్ డైరెక్టరు ఇచ్చిన లక్షరూపాయలను చేత బట్టుకొని రామారావు తన కుర్చీ దగ్గరకు వెళ్ళాడు. ఒక పెద్ద కవరు తీసి, లక్షరూపాయలను ఆ కవరులో పెట్టాడు. ఆ కవరులో లక్ష రూపాయలు ఉంటాయని ఎవరూ అనుకోరు. అంచేత, దారిలో ఎవరైనా ఆ కవరును అమాంతము లాక్కొని పొయ్యే ప్రమాదం లేదు. తను చెయ్యవలసినదల్లా, గబగబా ఉకుబీరువాకు తాళం వేసి, ఆ తాళాలు జేబులో వేసుకొని, బ్యాంకికి వెళ్ళడమే.

వెంకటరామయ్య కలప వ్యాపారస్థుడు కావడం వల్లనూ, కలప మీద ఆయనకు ఉన్న అభిమానంవల్లనూ, ముఖ్యమైన కాగితాలు, డబ్బూ పెట్టుకొనే బీరువాను కూడా ఉకుతోటే చేయించి, దానికి సీమనుంచి తెప్పించిన గట్టి తాళంకప్ప పెట్టించాడు. సాధారణంగా, ఆ బీరువాలో ఎప్పుడూ నాలుగైదువేల రూపాయల రొక్కం ఉంటుంది. బీరువా తాళాలు రామారావు దగ్గరే ఉంటాయి. పేరుకి రెండువేల రూపాయలు ధవాతు కట్టినా, రామారావు నమ్మకంగా పనిచేస్తున్నాడు. తాళాలు అతని దగ్గర ఉండటంలో వెంకటరామయ్యకు ఎప్పుడూ అనుమానం కలగలేదు.

బీరువాకు తాళం వేసి, తాళాలు జేబులో వేసుకొని, లక్ష రూపాయలు పెట్టిన కవరు చేతబట్టుకొని, రామారావు ఆఫీసునుంచి బైటికి వచ్చాడు. బైట టాక్సీ ఏదీ కనిపించలేదు. టాక్సీకోసం కని పెట్టుకుని నిలబడడంకంటె, కొంచెంమారం ముందుకు నడిస్తే టాక్సీ ఏదో ఒకటి తారసిల్లకపోదని నడవడం ఆరంభించాడు.

నడుస్తూవున్న మనిషికి ఆలోచనలు బాగా వస్తాయి. రామారావు ఇదివరకు ఎన్నడూ లక్షరూపాయలు చేతబట్టి ఎరగడు. అసలు అంత మొత్తాన్ని అతడు చూడనేలేదు. ఒకటి రెండుసార్లు పదివేల రూపాయల దాకా తన బీరువాలో పదిల పరచాడు. అంతే. సాధారణంగా తన

కంపెనీకి వచ్చేడబ్బు చెక్కుల రూపంగానే వస్తుంది. ఎప్పుడేనా కొంత మంది ఖాతాదార్లు రొక్కం ఇవ్వడం కద్దు. అదీ, పదివేల లోపే.

ఈనాడు లక్షరూపాయలను తను చేతబట్టడం అతనికి విశేషమే అనిపించింది. అంత డబ్బు, తనది కాకపోతే మాత్రమేం, తనచేతిలో ఉండటం ఒక యోగమే. పదినిమిషాలుగాని, పదిగంటలుగాని, యోగం యోగమే. తన తండ్రిగాని, తాతగాని వెయ్యి రూపాయలనోటుకాదు గదా, నూరురూపాయలనోటు మొహంకూడా చూసి ఎరుగరు.

రామారావు ఆలోచనలు మొదలు పెట్టాడు. లక్షరూపాయల తోటి ఎన్నో పనులు చెయ్యవచ్చు; ఎంతో సుఖపడవచ్చు. అదే తన డబ్బు అయితే ఎంత బాగుండును! ఆలోచన అంతవరకు వచ్చే టప్పటికి ఆ డబ్బును సొంతం చేసుకుంటే బాగుండు ననిపించింది. ఎలాగ? రామారావు ఆలోచనలు పరుగె త్తసాగాయి. మాట్లాడకుండా ఆ డబ్బుతో హైదరాబాద్‌నుంచి వెళ్ళిపోతే సరి.... పేరు మార్చుకొని మదరాసు, బొంబాయి, కలకత్తాలాంటి పెద్ద పట్టణాలలో దేనిలోనైనా కొంతకాలం గుంభనగా కాలం గడిపి, తరువాత మెల్లగా ఏదైనా వ్యాపారం చూసుకోవచ్చును- నెలకు నూటపాతిక రూపాయల జీతం మీద ఎన్నాళ్ళు గడపడము? జీతం చాలదనే కదా తాను ఇన్నాళ్లూ పెళ్ళి చేసుకోకుండా వున్నాడు! ఒకవేళ జీతం కాస్త పెరిగినా, ప్రస్తుత పరిస్థితులలో తన ఇష్టప్రకారం పెళ్ళి జరగదు. కట్నాలూ, కానుకలూ- సంప్రదాయాలూ, ఏదేదో చెప్పి, ఎవరో ఒక పిల్లను కట్టపెడతారు తన పినతండ్రీ, పినతల్లీ. తల్లీ, తండ్రీ చనిపోయినవాడికి, పినతండ్రి పినతల్లుల అజమాయిషీలో బ్రతకవలసిన ఖర్మం ఏమిటి? తనతోపాటు బి.ఏ. చదివిన రమణి మదరాసులో ఉంది. తనను పెళ్ళి చేసుకోడానికి ఒకప్పుడు ఉత్సాహం చూపింది కూడాను. ఇప్పటికీ ఆప్యాయంగా ఉత్తరాలు వ్రాస్తోంది. రమణికూడా తల్లి దండ్రులు లేరు. ఆమెను పెంచిన మేనత్త ఏదో పల్లెటూళ్ళో ఉంది. రమణిచేసే ఉద్యోగం కూడా ఏమంత పెద్దదికాదు. ఏదో మహిళాసమాజంలో గది అద్దెకు తీసుకొని, ఉద్యోగం చేస్తోంది. తనతో రమ్మంటే వచ్చేస్తుంది. ఈ రాత్రే ఎక్స్‌ప్రెస్‌లో మదరాసు వెళ్ళిపోతే సరి. బుధవారం దాకా

తన సంగతి పట్టించుకొనేవాళ్ళు ఎవరూ వుండరు. ఆ లోపల ఎవరూ ఊహించలేని పట్టణానికి తా మిద్దరూ వెళ్ళిపోవచ్చును. తాను ఆత్మ హత్య చేసుకుంటున్నాననీ, తనను గురించి ఎవరూ పట్టించుకో నక్కరలేదనీ ఒక వుత్తరం రాసి తనగదిలో పారేస్తే, ఎవరు వెతికినా తన శవంకోసం వెతుకుతారుగాని- తనకోసం వెతకరు. ఆ వెతకడం కూడా, హైదరాబాదు చుట్టుప్రక్కల వెతుకుతారుగాని, దూరపు పట్టణాలలో వెతకరు. అది భేషయిన ప్లాను.

రామారావు ఆలోచన అంతవరకు వచ్చేటప్పటికి దాదాపు రెండు ఫర్లాంగుల దూరం నడిచాడు. అప్పుడు టాక్సీకూడా కనపడింది. టాక్సీ ఎక్కి బ్యాంకికి వెళ్లాడు. బ్యాంకిలో చెయ్యవలసిన పని ఏమిటో, టాక్సీలో వెడుతూ నిర్ణయించుకున్నాడు గనుక, రెండు వెయ్యిరూపాయల నోట్లను బ్యాంకిలో మార్చి, ఒక వెయ్యి రూపాయలకి పదిరూపాయల నోట్లనూ, మరొక వెయ్యి రూపాయలకి అయిదు రూపాయల నోట్లనూ తీసుకొని, తన గదికి వెళ్లి, తన ఆలోచన ప్రకారం ఉత్తరం వ్రాసి, రాత్రి ప్రయాణానికి సిద్ధమయ్యాడు.

*　　　*　　　*

ఆదివారం సాయంత్రం, రామారావు మదరాసులో దిగాడు. కాస్త పేరున్న హోటలుకి వెళ్ళి గది తీసుకున్నాడు. స్నానంచేసి, శుభ్రమైన బట్టలు వేసుకొనేసరికి ఆరున్నరగంట లయింది. ఇంక అప్పుడు రమణి వున్న సమాజానికి వెడితే మర్యాదగా వుండదనే భావమూ, ప్రయాణపు బడలికా, మనస్సులో ఉన్న కొద్దిపాటి భయమూ అతన్ని ఆ పూటకి హోటలునుంచి బైటికి వెళ్లనియ్యలేదు. ఎనిమిది గంటలకే భోజనంచేసి, మదరాసునుంచి ఏ వూరుకు వెడదామా, తనను ఏ మాత్రం కనిపెట్టలేనివాళ్లు ఉన్న మహానగరం ఏమిటా అని ఆలోచిస్తూ నిద్రపోయాడు.

సోమవారం ఉదయం నిద్ర లేచినప్పుడు, రామారావుకి తన పరిసరాలు కొత్తగా కనిపించాయి. తన పరిస్థితి కొంత వింతగానే తోచింది. అయినా, ఒక నిర్ణయానికి రావడం ఎప్పుడో జరిగిపోయింది కనుక, ధైర్యంగానే ఉన్నాడు. స్నానంచేసి, టిఫిను తిని, రమణి వున్న సమా

జానికి వెళ్లాడు. ఆనాడు గాంధిజీ జన్మదినం గనుక, ఆ సమాజంలో చిన్న ప్రార్థన సమావేశం జరిగింది. సమాజంలోని మహిళలు ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు. రమణి కనపడింది. నవ్వుతూ రామారావును పలకరించింది.

"రమణీ! నేను నీకోసమే వచ్చాను. నీతో ఒక ముఖ్యవిషయం మాట్లాడాలి. నాతోటి, నా హోటలుకు వస్తే, నా గదిలో మాట్లాడు కుందాము. రాగలవా?" అని అడిగాడు.

రమణి రామారావు వైపు ఆప్యాయంగా చూసింది. వింతగా నవ్వింది. రామారావు పరవశు డయాడు. "మనిద్దరమూ ఏ బొంబాయో వెళ్ళి పెళ్ళి చేసుకుందాము. నాకు చాలా డబ్బు వచ్చింది" అన్నాడు.

"నేను మీకు ఉత్తరం వ్రాసి నెలరోజులయింది కదూ?" అని అడిగింది రమణి. ఆ ప్రశ్న అవసరం రామారావుకు తెలియలేదు.

"దాని కేముంది? ఫరవాలేదు. నువ్వు వ్రాయకపోతే, నేనైనా వ్రాయవలసింది. కాని, ఏవో పనుల్లోబడి వ్రాయలేకపోయాను. అయినా, స్వయంగా నేనే నీకోసం వచ్చానుగా!" అన్నాడు.

రమణి మళ్ళీ నవ్వింది. ఆ నవ్వు, తనను చూసి జాలిపడు తున్నట్టు తోచింది రామారావుకి.

"నాకు పెళ్ళయి అప్పుడే పదిహేను రోజులయింది. మా వారు ఇక్కడ బ్యాంకిలో ఆఫీసరు. మేము ఇల్లుకూడా ఏర్పాటు చేసుకున్నాము. ఇవ్వాళే నేను కూడా ఆ యింటికి మారుతున్నాను. అంచేత, మీ హోట లుకు రాలేను. బహుశా కాస్సేపటిలో మా వారు ఇక్కడికి వస్తారు. మీకు పరిచయం చేస్తాను, వుండండి," అంది రమణి.

రామారావు నివ్వెరపోయాడు. కొంచెం సేపటికి తెప్పరిల్లుకొని, "వద్దు, నిన్ను చూడాలని వచ్చాను. ఇంక వెడతాను" అంటూ వెనక్కు తిరిగాడు. రమణి ఏమీ మాట్లాడ లేదు.

రామారావు కొంత నిరుత్సాహంతోనూ, కొంత సంతృప్తితోనూ హోటల్ గదికి చేరుకున్నాడు. రమణి తనతో రానందుకు నిరుత్సాహం కలిగినా, తన పూర్వోత్తరం తెలిసిన మనిషిని తనతో తీసుకు వెళ్ళ నక్కరలేనందుకు కొంత సంతృప్తి కలిగింది. ఇకముందు చెయ్యా

వలసినది ఏమిటా అని ఆలోచిస్తూ తన గదిలో కూచున్నాడు. బల్లమీద ఉదయపు న్యూస్ పేపరు కనపడింది. పేపరు చూడకుండా తాను ఉదయం బైటికి వెళ్ళాడు. భవిష్యత్కార్యక్రమాన్ని గురించి ఆలోచిస్తూ, ఆ పేపరు తీసుకొని మొదటి పేజీమీద తన దృష్టిని ప్రసరించాడు.

"హైదరాబాద్‌లో పెద్ద అగ్నిప్రమాదం" అని పెద్ద అక్షరాల శీర్షిక అతడి దృష్టిని ఆకర్షించింది. చదవడం మొదలుపెట్టాడు.

హైదరాబాదులోని కలప అడితీల ప్రాంతంలో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు పాతిక లక్షల రూపాయల విలువచేసే కలప భస్మమై పోవడమేకాక, ఆ అడితీలలో వున్న ఎనిమిది ఆఫీసు భవనాలు పూర్తిగా దగ్ధమైపోయాయి. ఆ ఆఫీసుల పేర్లలో, రామారావు పని చేసే ఆఫీసు పేరుకూడా వుంది. ఆ ఆఫీసుల పేర్లు చదివేటప్పటికి, భవిష్యత్తును గురించిన ఆలోచనలో ఒక మెరుపు మెరిసింది.

తన ఆఫీసు పూర్తిగా దగ్ధమై పోయిందంటే, ఆఫీసులోని రికార్డుల్లూ, క్యాష్ పెట్టే, బీరువా దగ్ధమైపోయినట్లే. తాను నిశ్చింతగా మళ్ళీ హైదరాబాద్ వెళ్ళిపోవచ్చును. లక్షరూపాయలు బ్యాంకిలో కట్టడానికి తాను వెళ్ళినప్పుడు టాక్సీ దొరకలేదనీ, నడిచి వెళ్ళినందున ఆలస్యమైందనీ, బ్యాంకి మూసివేసి వుందనీ, వెంటనే ఆఫీసుకు వచ్చి లక్ష రూపాయలు బీరువాలో భద్రపరచాననీ మేనేజింగ్ డైరెక్టరుకు చెప్ప వచ్చును. లక్ష రూపాయలు తన దగ్గరే వుంచుకొని, అనుకూలమైన సమయం వచ్చినప్పుడు తాను వుపయోగించుకోవచ్చును. అంతవరకు తనకు ఆరోగ్యం వుంటుంది. తన పేరు చెడకుండా వుంటుంది. ఈ ఆలోచన తట్టగానే, చేతి గడియారం చూసుకున్నాడు. ఎక్స్‌ప్రెస్ బయలుదేరడానికి చాలా టైము వుంది. వెంటనే హోటల్ బిల్లు చెల్లించి మళ్ళీ స్టేషనుకు బయలుదేరాడు.

* * *

మంగళవారం ఉదయం, హైదరాబాద్ చేరగానే రామారావు తన గదికి వెళ్ళి, ఆత్మహత్య చేసుకుంటున్నానని తాను వ్రాసిపెట్టిన ఉత్తరాన్ని చించి పారవేసి, స్నానం చేసి, శుభ్రమైన బట్టలు కట్టుకొని,

మేనేజింగ్ డైరెక్టరు ఇంటికి వెళ్ళాడు. వెంకటరామయ్య బలార్షానుంచి ఇంకా తిరిగి రాలేదని, సాయంత్రం వస్తాడని తెలిసింది. అంతవరకు అంతా అనుకూలంగానే వుందనే సంతృప్తితో, తగలబడిపోయిన తన ఆఫీసు చూడడానికి వెళ్లాడు రామారావు.

ఆఫీసు పూర్తిగా తలబడిపోయింది. ఆఫీసులో వున్న బల్లలు, కుర్చీలు, బీరువాలు భస్మమయిపోయాయి. ఆ ఆఫీసుల ప్రక్కనే వున్న పెట్రోలుబంకు తగలబడి, మంటలు దారుణంగా ప్రజ్వరిల్లినందున, మంటల్ని ఆర్పడం సాధ్యం గాలేదట. కాలి, బొగ్గయిన దుంగలు ఎన్నో ఇంకా పూర్తిగా ఆరలేదు కూడాను. అదంతా చూస్తూ, దూరంగా నిలుచున్నాడు రామారావు. ఆ ప్రాంతం అంతా పోలీసులమయంగా వుంది- నిప్పులను ఆర్పడానికి ఇంకా నీళ్ళు పోస్తూనే ఉన్నారు.

"ఏమయ్యా, రామారావ్! మీ ఆఫీసు అంతా బొగ్గయిపోయిందే!" అన్న గొంతువిని రామారావు వెనక్కు తిరిగిచూశాడు. తనను పలకరించింది, బ్యాంకి ఏజెంటు. ఆయనను చూడగానే మనస్సులో ఏదో భయం కొంచెం కలిగినా, ధైర్యంగానే "అవునండి. లోపల చాలా కాష్‌కూడా ఉంది" అన్నాడు.

"ఏదో ఉంటుంది; ఉండకపోతుందా? శనివారంనాడు నువ్వు బ్యాంకికి వచ్చినప్పుడు, వెంకటరామయ్యగారు ఫోన్ చేశారు, లక్షరూపాయలు జమ కడుతున్నాపని. ఆ నాడు నువ్వు లక్ష జమకట్టకపోతే, అది కూడా తగలబడిపోయేదే. ఇన్సూరెన్సువాళ్ళు బిల్డింగుకూ కలపకూ డబ్బు యిస్తారుగాని, కాష్ పోయిందంటే నమ్మరుగా!" అంటూ బ్యాంకి ఏజెంటు, ఇంకెవరితోటో మాట్లాడడానికి ముందుకు వెళ్లాడు. రామారావు మొహం హఠాత్తుగా తెల్లబడడం ఆయన చూడలేదు.

రామారావు కాళ్ళూ చేతులూ చల్లబడ్డాయి. కొంతసేపటికి, తెప్పరిల్లుకొని తన గదికి చేరాడు. మెల్లిగా అతడి మెదడు పనిచెయ్యసాగింది. తాను బ్యాంకికి వెళ్ళేసరికి, బ్యాంకి మూసివేశారన్న మాట ఇక చెల్లదు. పైగా, తాను రెండు వెయ్యి రూపాయల నోట్లను మార్చిన సంగతికూడా బయటపడిపోతుంది. ఎవరికీ తెలియని విషయం, తాను మదరాసు వెళ్ళిరావడమే. అంచేత ఆ సంగతిని తాను బైటపెట్ట నక్కర

లేదు. తాను మదరాసు వెళ్ళి రావడానికి నూరురూపాయలు ఖర్చయింది. తను శనివారంనాడు తీసుకున్న జీతం ఇంకా అలాగే ఉంది కనుక, నూరు రూపాయలను సర్దివేసి, లక్ష రూపాయలను వెంకటరామయ్య గారికి ఇచ్చివేస్తే ఆయన సంతోషిస్తాడు. తన జీతం పెంచినా పెంచ వచ్చు. బహుమతి ఇవ్వవచ్చు. కాని, బ్యాంకిలో లక్ష రూపాయలను శని వారంనాడే ఎందుకు కట్టలేదంటే, ఏమిటి చెప్పడం? ఏం చెప్పినా అబద్ధం అవుతుంది.

బుధవారం ఉదయమే బ్యాంకికి వెళ్లి లక్ష రూపాయలు జమకట్టి వేస్తే, ఏ పేచీ ఉండదు. బుధవార మంతా వెంకటరామయ్య, తగలడి పోయిన ఆఫీసును గురించీ, ఇన్సూరెన్సును గురించీ ఆలోచనలో ఉంటాడు. బ్యాంకి అకౌంటు చూచుకొనేటప్పటికి, లక్ష రూపాయలు జమ ఉంటుంది. చిక్కు లేకుండా, తాను యథాప్రకారం జీవితం సాగించవచ్చును- అని నిర్ణయించుకున్నాడు రామారావు. పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డాం, అనే ధైర్యం కలిగింది అతడికి. ఆ తరువాత, ఆ రోజంతా నిశ్చింతగానే గడిచిపోయింది రామారావుకి.

బుధవారం ఉదయం- బైటికి వెళ్ళడానికి తయారైన తరువాత ముందు వెంకటరామయ్యగారి యింటికి వెళ్ళడమా, బ్యాంకికి వెళ్ళడమా అని ఆలోచించాడు. బ్యాంకిలో లక్ష రూపాయలు కట్టివేసి తరువాత వెంకట రామయ్యగారి ఇంటికి వెళ్ళడం మంచి దనిపించింది. మూడు రోజుల తరువాత బ్యాంకి తెరుస్తారు కనుక, అక్కడ కొంచెం ఆల స్యంగా బ్యాంకికి వెళ్లడం మంచి దనుకున్నాడు.

రామారావు బ్యాంకికి వెళ్ళేటప్పటికి, బ్యాంకి తెరచి గంటన్నర అయింది. అయినా, డబ్బు కట్టేవాళ్లూ, తీసుకొనే వాళ్ళూ ఎక్కువ గానే ఉన్నారు. కౌంటరు దగ్గిర క్యూలో నిలబడితే, తాను డబ్బు కట్టడా నికి ఇంకా గంట పట్టేటట్టుంది. అంచేత, లోపలికి వెళ్ళి అకౌంటెంటుకి స్వయంగా డబ్బు ఇచ్చి, చలాన్ తీసుకొని వెళ్ళిపోదా మనుకున్నాడు. అకౌంటుంటు దగరకు వెళ్లాడు. అతడు రామారావును ఒకసారి ఎగా దిగా జాలిగా చూసి, "మీరు ఒకసారి ఏజెంటుగారి గదిలోకి రండి" అని, తన కుర్చీలోనుంచి లేచాడు. ఎందుకో అర్థంకాక, ఏమి చెయ్య

డానికి పాలుపోక, రామారావు అకౌంటెంటు వెనకే ఏజెంటు గదిలోకి వెళ్లాడు.

లోపలికి వెళ్లాడో లేదో, రామారావుకి నవనాడులూ క్రుంగి పోయాయి. నిర్ఘాంతపోయి అలాగే నిలబడిపోయాడు. ఏజెంటు గదిలో వెంకటరామయ్యా, ఒక పోలీసు ఇన్‌స్పెక్టరూ, ఏజెంటుతో మాట్లాడు తున్నారు.

రామారావు లోపలికి రాగానే, "రామారావు ఇతనే" అని ఇన్‌స్పెక్టరుకు చూపించాడు వెంకటరామయ్య.

"ఇంకేం, వెంటనే అరెస్టు చేస్తాను," అన్నాడు ఇన్‌స్పెక్టరు.

"అసలు సంగతి అంతా అతనికి చెప్పండి," అన్నాడు ఏజెంటు.

"రామారావ్, వెంకట రామయ్యగారు శనివారం నాడు నీకు లక్ష రూపాయలు యిచ్చి బ్యాంకిలో జమ కట్టమన్నారు. నువ్వు ఆ డబ్బు జమకట్టకుండా, రెండు వెయ్యి రూపాయల నోట్లను మాత్రం అయిదు, పది నోట్లకు మార్చుకున్నావు. ఆ రోజు రాత్రి ఎక్స్‌ప్రెస్‌లో నువ్వు ఎక్కడం, అదే ఎక్స్‌ప్రెస్‌లో బలార్షా బండిలో ఎక్కిన వెంకటరామయ్యగారు చూశారు. మూడు రోజులు సెలవు గదా, ఏ విజయవాడో వెడుతున్నా వనుకున్నారు. కాని, నువ్వు మదరాసు వెళ్లావు. అక్కడ రమణి అనే ఆవిడను కలుసుకొని, నీకు చాలా డబ్బు వచ్చిందనీ, ఆమెను పెళ్ళి చేసుకుంటా ననీ, బొంబా యికి వెడదామనీ చెప్పావు. ఆమె నీతో రానందున, మళ్ళీ హైద్రాబాద్ వచ్చేశావు. వెంకటరామయ్యగారు ఇచ్చిన లక్షరూపాయలను కాజేద్దా మని ప్రయత్నం చేశావు. అదీ నేరం," అన్నాడు ఇన్స్‌పెక్టరు.

"రమణి నాకు వుత్తరం రాసింది. రమణి, నా వదినగారి కూతురు. ఆ బాంధవ్యం ఇతడికి తెలియదు. రామారావు ఖిన్నుడై తిరిగి వచ్చాడనీ, అతడిని జాగ్రత్తగా చూడవలసిందనీ రాసింది. నా డబ్బుతో పరారీ అయాడని రమణికి తెలియదు. పాపం, నా కంపెనీలో ఉద్యోగంలో చేరానని ఏడాదిన్నరనాడు రామారావు రాసినప్పుడు, రమణి నాకు మా బంధుత్వాన్ని గురించి అతడికి చెప్పవద్దనీ, అతడిని పైకి తీసుకురావ

జానికి సహాయం చెయ్యవలసిందనీ ఉత్తరం రాసింది. చివరకు, ఇతడు చేసిన పని ఇది," అన్నాడు వెంకట రామయ్య.

ఈ మాటలలో ఎన్ని వినిపించాయో, ఎన్ని వినిపించలేదోగాని రామారావు నిలుచున్నట్టు కూలబడ్డాడు. అతని చేతిలోవున్న లక్షరూపా యల కవరు క్రిందపడింది. వెంకటరామయ్య ఆ కవరును ఆప్యా యంగా తీసుకొని, "లక్ష రూపాయలు ఉన్నాయో లేవో చూసి, మా ఖాతాలో జమ కట్టించండి" అని ఏజెంటు చేతికి యిచ్చాడు.

---

# 21. రిక్షావాలా

చేసిన పాపం చెపితే పోతుందంటారు. చెప్పినంత మాత్రాన పోతుందా? మనస్ఫూర్తిగా పశ్చాత్తాప పడి, ఇహ మళ్ళా జన్మలో చెయ్యననే నిశ్చయానికి వచ్చి యేడుస్తూ చెప్పినప్పు డేమన్నా పోతుందేమో

నేను చేసిన పాపం, అంతులేనిది. ఆ పాపాన్నించి నాకు ముక్తి ఉంటుందని నేను అనుకోను. అయినా అనుభవించవలసిందే! అసలు సంగతికి వద్దాం.

చీకటి పడుతోంది. మనిషి మొహం కనపడీ కనపడనట్టుగా ఉంది వెలుతురు. ఎక్వేరియం రెస్టరెంటులో, నా సహాధ్యాయిని శాంతతో కూడా టిఫిను తిని బయటికి వచ్చాను.

"ఎక్కడికి పోదాం " అంది శాంత.

"చెప్పు నువ్వే."

"మీ గదికి పోదాం పద. ఇవ్వాళకి తిరిగింది చాలు. చదవాల్సి నది బోలెడు ఉంది."

"అలాగే."